నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 29 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

కల్వకుర్తి-జడ్చర్ల రహదారిపై ఆందోళన చేస్తున్న పాడి రైతులు, నాయకులు

రోడ్డెక్కిన పాడి రైతులు

- పాల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్
- బోయిన్‌పల్లి వద్ద రహదారిపై బైఠాయించి నిరసన

మిడ్జిల్, జూన్ 28 : పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని పాడి రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లులను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని బోయిన్‌పల్లి వద్ద కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై పాడి రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా మండలంలో సుమారు రూ.2.5కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, నేటికీ అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 15రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు 60 రోజులు దాటినా ఇవ్వకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో దాణాను కొనుగోలు చేయలేకపోతున్నామని రైతులు వాపోయారు. పెండింగ్‌లో ఉన్న లీటర్‌కు రూ.4 ప్రోత్సాహక బిల్లులు వెంటనే చెల్లించకపోతే నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, నరేశ్, హరికృష్ణారెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, సత్యం, నర్సింహ, శ్రీను, గణేశ్, బంగారు, రాము, అమర్నాథ్‌రెడ్డితోపాటు పాడి రైతులు పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో ఉద్రిక్తత

పోల్కంపల్లి నల్లకుంట వద్దకు వచ్చిన దళితులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

- చేపలు పట్టే విషయంలో దళితులు, మత్స్యకారుల మధ్య వివాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య

మూసాపేట, జూన్ 28 : మండలంలోని పోల్కంపల్లి శివారులో ఉన్న నల్లకుంట వద్ద శుక్రవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య మత్స్యకారులు చేపలు పట్టారు. వివరాలిలా.. మూసాపేట మండలంలోని పోల్కంపల్లి శివారులో ఉడిపల్ల చెరువు, ఊరచెరువు, సేరి కుంట, బాలవనికుంట, బాపనికుంట తోపాటు నల్లకుంట చెరువు ఉన్నది. అయితే నల్లకుంటలో చేపలు పట్టే విషయంలో గ్రామానికి చెందిన దళితులు, మత్స్యకారుల మధ్య కొంతకాలంగా పోటీ నడుస్తున్నది. ఆ కుంటలో తమ భూములున్నాయని, అందుకే కొన్నేండ్లుగా అందులో చేపలు పడుతున్నామని దళితులు చెబుతున్నారు. ఇందుకోసం కోర్టును ఆశ్రయించినట్లు వారు తెలిపారు. కానీ చెరువులు, కుంటలకు ప్రతి యేటా రుక్కం కడుతున్నాం.. చేపలు పట్టే హక్కు మాకే ఉందని మత్స్యకారులు అంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి దండు రాధారోహిణి దృష్టికి తీసుకెళ్లి నల్లకుంటలో చేపలు పట్టుకునేందుకు తమకు పోలీసుల రక్షణ కావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈక్రమంలో నల్లకుంటలో చేపలు పట్టే హక్కు గ్రామ మత్స్యకారులకే ఉందని, వారికి రక్షణ కల్పించాలని మత్స్యశాఖ తరపున పోలీసులకు లెటర్ పంపించారు. దీంతో శుక్రవారం భూత్పూర్ సీఐ రామకృష్ణతోపాటు మూసాపేట ఎస్సై సుజాత, అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు, చిన్నచింతకుంట ఎస్సై శేఖర్, దేవరకద్ర ఎస్సై నాగన్న ప్రత్యేక సిబ్బందితో నల్లకుంటకు చేరుకున్నారు. మత్స్యకారులు చెరువులోకి దిగి వలతో చేపలు పడుతుండగా దళితులు అక్కడికి వచ్చి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

దీంతో సీఐ కలుగజేసుకొని మీవద్ద చేపలు పట్టడానికి అనుమతి పత్రాలు ఉంటే చూయించాలన్నారు. కొన్నేండ్లుగా అందులో చేపలు పడుతున్నామని, తమ వద్ద ఎలాంటి పత్రాలు లేవని వారు తెలిపారు. ఈ సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పోలీసులు వారికి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ఇప్పటికే అప్పుల పాలయ్యాం
- మాజీ సర్పంచుల డిమాండ్

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

అయిజ, జూన్ 28 : పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములైన తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచులు అధికారులకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి, ఎంపీడీవో వెంకటయ్య, ఎంపీవో నర్సింహారెడ్డిలకు మాజీ సర్పంచులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఐదేండ్ల కాలంలో ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేశామని, నిధులు మంజూరైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల కిందటే ఖర్చు చేసిన నిధులకు ఎంబీలు చేసినప్పటికీ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రత్యేకాధికారులు తాము చేసిన పనులకు బిల్లులు చేసుకుంటున్నారని, తమకు రావాల్సిన బిల్లులు మాత్రం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పదిరోజుల్లో బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ ప్రస్తుతం జీపీల్లో జమ చేస్తున్న నిధులను పెండింగ్ బిల్లులకు చెల్లిస్తున్నామన్నారు. త్వరలో అందరికీ చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తిప్పారెడ్డి, హన్మంతురెడ్డి, నీలకంఠారెడ్డి, నాయకులు కిశోర్, రామలింగన్న ఉన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

- ఆగస్టు 15లోగా రుణమాఫీ
- ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలూనాయక్
- డిండి ప్రాజెక్టు కుడి కాల్వకు నీటి విడుదల

కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

అచ్చంపేట రూరల్, జూన్ 28 : చివరి ఆయకట్టుకూ సాగునీటిని అందిస్తామని అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలూనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం డిండి ప్రాజెక్టు (గుండ్లపల్లి) వద్ద వారు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల తదితర గ్రామాలకు నీరు అందుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులకు మేలు చేసేందుకు నాడు శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను కేఎల్ఐ ద్వారా తీసుకొచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.రెండులక్షల రుణమాఫీని ఆగస్టు15లోగా పూర్తి చేస్తామన్నారు. డిండి ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి కూలీలతో కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అంతకుముందు కట్టకింద ఉన్న మైసమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప్పునుంతల, అచ్చంపేట జెడ్పీటీసీలు అనంతప్రతాప్‌రెడ్డి, ముడావత్ మంత్రియానాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకుడు అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పాలమూరు, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 806 బాలికలు, 506 మంది బాలురు (మొత్తం 1,306 మంది) పరీక్షలు రాయగా 556 బాలికలు, 361 మంది బాలురు (మొత్తం 917 మంది) ఉత్తీర్ణత సాధించారని డీఈవో రవీందర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70.21 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

పట్టిన చేపలను చూపుతున్న మత్స్యకారులు

చేప చిక్కిన ఆనందం

మూసాపేట, జూన్ 28 : మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని నల్లకుంటలో శుక్రవారం చేపల వేట కొనసాగింది. మత్స్యకారుల వలకు పెద్దమొత్తంలో చేపలు పడడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. కొర్రమీను, రొటలు, బొచ్చలు, బంగారుతీగలతోపాటు దూబొచ్చలు లభ్యమయ్యాయి. 20 కిలోల బరువున్న రొటరకం చేప చిక్కింది. దీంతో జాలర్లు సంతోషపడ్డారు. మొత్తం 2 క్వింటాళ్ల చేపలు పట్టినట్లు, వీటిని మార్కెట్‌లో విక్రయిస్తామని వారు తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- ఫ్యాక్షన్ పాలిటిక్స్ షురూ చేసింద్రు
- దమ్ముంటే అభివృద్ధిలో నాతో పోటీ పడండి
- ప్రజల గుండెల్లోంచి 'మర్రి' పేరును చెరపలేరు
- సిర్సవాడ స్కూల్ ప్రారంభంపై మాజీ ఎమ్మెల్యే మర్రి ఆగ్రహం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృతజ్ఞతలు
- సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న పోలీసులు : బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్‌పీ

విద్యపై రాజకీయాలా..?

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జూన్ 28 : అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే కాంగ్రెస్ నాయకులు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. విద్యపై రాజకీయాలు చేయొద్దని, చేతనైతే అభివృద్ధిలో తనతో పోటీపడాలని ఆయన హితవు పలికారు. తన నిధులతో నిర్మించిన పాఠశాలపై ట్రస్టు పేరును తుడిచి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి నాగర్‌కర్నూల్‌లోని వైభవ్ గార్డెన్స్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఇటీవల జరిగిన పరిణామాలపై మర్రి స్పందించారు. ప్రారంభించిన పాఠశాలనే మళ్లీ ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. సేవాభావంతో తన ట్రస్టు ద్వారా నాలుగు పాఠశాలలు నిర్మించానన్నారు. మీకు చేతనైతే మరో నాలుగు స్కూళ్లు నిర్మించాలని.. తమ నాయకులతో వచ్చి సన్మానం కూడా చేస్తామని మర్రి అన్నారు. రాజకీయ స్వలాభం కోసం పూర్తయిన పాఠశాలను ఏడు నెలలుగా ప్రారంభించకుండా ఆపింది మీరు కాదా? అని ఆయన ప్రశ్నించారు. సొంత డబ్బులతో స్కూళ్లు కట్టించిన తనపైనే కేసులు పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పాఠశాలకు తమ పేరు లేకుండా చేశారు కానీ.. ప్రజల గుండెల్లో నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి పేరును చెరపలేరన్నారు. ప్రజలపై అభిమానంతో రూ.5కే భోజనం పెడుతున్నానని.. మీకూ ప్రేమ ఉంటే రూ.1కే భోజనం పెట్టాలని సూచించారు. ఏదో ఉద్ధరిస్తారని ప్రజలు మిమ్మల్ని గెలిపించారని గుర్తు చేశారు. అభివృద్ధిని వదిలేసి తమ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ అరాచకాలకు ఎవరూ అధైర్యపడొద్దని, తమకు మంచిరోజులొస్తాయని ధైర్యం చెప్పారు. '2014లో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడూరులో కాలేజీ నిర్మాణానికి భూమి ఇచ్చి ఆ కళాశాలకు మీ కుటుంబ సభ్యుల పేరు పెట్టుకున్నారు. అప్పట్లో నేను అనుకుంటే ఆ పేరు ను తొలగించొచ్చు కానీ.. నేనలా చేయలేదు.. నేను నాలుగు స్కూల్స్ కడితే మీరు ఎనిమిది కట్టండి.. అప్పుడు ప్రజలే మిమ్మల్ని మెచ్చుకుంటారు కానీ.. నేను కట్టించి ప్రారంభించిన స్కూల్ బోర్డులపై పేర్లు చెరిపి మళ్లీ ప్రారంభించడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అని మర్రి అన్నారు.

ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పోలీసులు: ఆర్ఎస్‌పీ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో శాంతిభద్రతల విషయంలో పోలీసులు చేతులెత్తేశారన్నారు. కాలేజీకి వెళ్లి బెంచీల ఫొటో తీసినందుకు మర్రి జనార్దన్‌రెడ్డి పీఏ నర్సింహపై పోలీసులు కక్ష గట్టారని, విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి ఇబ్బంది పెట్టారన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో ఎలాంటి పురోగతి లేదని.. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. పెద్దకారుపాములలో దళితులపై నాయినోనిపల్లి మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, అతడి అనుచరులు దాడి చేసినా మంత్రి జూపల్లి అండతో వారిని అరెస్టు చేయలేదన్నారు. డీజీపీని కలిశాక ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారన్నారు. ఇలాంటి సమయంలో కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎదిరించే లేకుంటే బెదిరించేవాడిదే రాజ్యమవుతుందన్నారు. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి పనిచేయడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందన్నారు. అనంతరం సన్మాన గ్రహీత, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన ప్రజాప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవసరం ఉన్నా తన సహకారం ఉంటుందన్నారు. కార్యకర్తలు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పార్టీలో ఉన్నవారు మోసం చేయడం వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందామని తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

4.50లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం

- ప్రాజెక్టు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి
- కేఎల్ఐలో పనిచేయని రెండు మోటర్లు
- నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ తాగునీటి జలాలు
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు


పీఆర్ఎల్ఐ ప్రాజెక్టు పరిశీలనలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూన్ 28 : కేఎల్ఐలోని ఐదు మోటర్లు పంపింగ్ చేస్తే పూర్తిస్థాయిలో సాగునీటిని అందించవచ్చని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మంత్రి కొల్లాపూర్ మండలం ఎల్లూరు, రేగుమాన్‌గడ్డ సమీపంలోని కేఎల్ఐ, పీఆర్ఎల్ ప్రాజెక్టుల్లోని పంప్ సెట్లు, మోటర్లు, టన్నెల్, ఓపెన్ కెనాళ్లను, పీఆర్ఎల్ఐ మొదటి రిజర్వాయర్, ఎల్లూరు రిజర్వాయర్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ కెనాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ కేఎల్ఐ ప్రాజెక్టు కింద జమ్ముతో నిండిన కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కేఎల్ఐతో పాటు, జూరాల, నెట్టంపాడు, భీమా ప్రాజెక్టుల కింద ఉన్న కాల్వలకు కూడా మరమ్మతులు చేపట్టాలన్నారు. కేఎల్ఐలోని ఐదు మోటర్లలో రెండు పనిచేయడం లేదని.. వాటికి రిపేర్ చేయించి త్వరలోనే మిషన్ భగీథకు నార్లాపూర్ పీఆర్ఎల్ఐ మొదటి రిజర్వాయర్ ద్వారా నీళ్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీశైల జలాశయంలో నీళ్లు లేకున్నా భగీరథకు నీళ్లు అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. కేఎల్ఐ ద్వారా 4.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. రోజుకు 4వేల క్యూసెక్కులను పంపింగ్ చేయొచ్చని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఇరిగేషన్ సమస్యలపై పరిష్కారం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అవినీతికి అవకాశం లేకుండా రాత్రింబవళ్లు పని చేస్తామన్నారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జనరల్ దవాఖాన ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న వైద్యులు

ఆంక్షలను వెనక్కి తీసుకోవాలి

- ప్రభుత్వ వైద్యుల డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో నిరసన

మహబూబ్‌నగర్, జూన్ 28 : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న వైద్యులపై ఆంక్షలు విధించడం సరికాదని ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖాన, మెడికల్ కళాశాలలో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నల్లగొండ జనరల్ దవాఖానలో పనిచేసే డాక్టర్ల హాజరు, దవాఖానను పర్యవేక్షించడానికి రోజుకో అధికారికి డ్యూటీ వేస్తూ కలెక్టర్ ఆర్డర్ ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే బదిలీలు, రూరల్ కళాశాల అలవెన్స్ లేక.. ఏరియర్, మెడికల్ బిల్స్ కాక తీవ్ర నిరాశలో ఉన్న తమకు కలెక్టర్ చర్య పుండు మీద కారం చల్లినట్లు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బోధనా వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు హన్మంత్ ప్రసాద్, వంశీ, అపర్ణ, నరేందర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- మౌలిక వసతుల కల్పనలో సర్కారు విఫలం
- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీశ్

ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాలమూరు, జూన్ 28 : జిల్లావ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ బడుల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సముదాయంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా పేద విద్యార్థులు మెరుగైన విద్యకు దూరమవుతున్నారన్నారు. అటెండర్లు, స్కావెంజర్లు లేక విద్యార్థులే పారిశుధ్య పనులు చేస్తున్నారని, ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవో స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి నవేంద్ర, జిల్లా సంఘటన మంత్రి మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ, అరవింద్, అక్షయ, కార్తీక్, వరుణ, శివసాగర్, మణి, కృష్ణ, పవన్, ఠాగూర్, ఆకాశ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.